అల్లుడి కోసం వెళ్ళిన ఆమెకు ఎదురైన అనుభవం?

అలపర్తి రామకృష్ణ కథ

# బొద్దింకలు

మరో నిద్రలేని రాత్రి గడిపి నాలుగుగంటలకే లేచి కూర్చుంది రసజ్ఞ.

ప్రతి రాత్రి ఆమెకు వసంతరాత్రి కాదు. కాళరాత్రి కూడా కాదు. రాత్రిళ్లు అంటే అసహ్యం ఆమెకు.

ఓ చీకటి రాత్రి తల్లి త్రాచుపామును తొక్కడంతో అది కరిచేసరికి ప్రాణాలు కోల్పోయింది. తండ్రి కూడా చీకట్లో చెక్కవంతెన మీదుగా కాలువదాటుతూ కాలుజారి కాలువలోపడి చనిపోయాడు.

మరో సంఘటన చీకటి అంటే మరీ అసహ్యాన్ని పెంచింది రసజ్ఞ మనసులో.

అప్పటివరకూ తియ్యటి కబుర్లు చెబుతూ కరెంటుపోగానే అమాంతంగా మీదపడి ఆమె శీలం దోచుకున్నాడు ప్రభు.

రసజ్ఞ వంటింట్లోకి వెళ్లి లైటువేసింది.

చీకట్లో స్వేచ్ఛగా తిరిగే బొద్దింకలు లైటు వెలుగుకు కంగారుపడి బియ్యపుబస్తా చాటుకు, పాత డబ్బాల మధ్యకు వురుకులు పరుగులతో వెళ్ళిపోయాయి.

చిరాకుగా అవి వెళ్ళిన వైపే చూస్తూ వుండిపోయిందామె.

స్నానంచేసి తల చిక్కు తీసుకుంటూ ఇంటి ముందువైపుకు వచ్చి నిలబడింది రసజ్ఞ.

ఇంటిముందున్న పూలమొక్కలను పలుకరిస్తున్నాడు సూర్యుడు.

గులాబీలు, మందారాలు నవ్వు మొహం పెట్టాయి.

ప్రభాత కిరణాలు వెలుగులో చుట్టూ ప్రపంచమంతా కొత్త వెలుగుతో ముచ్చటగా కన్పించిందామెకు.



మృత్యువు కోరల్లో చిక్కుకుని మరో క్షణంలో చనిపోయే వ్యక్తి కూడా నులివెచ్చని సూర్యుని కిరణాలు సోకగానే దుఃఖాన్ని చావుని వెళ్ళిపొమ్మని కసరి కొడతాడు.

చీకటి, చలి సూర్యుడికి భయపడి పారిపోతాయి.

చెట్లు చేమ సూర్యుడికి స్వాగతం చెప్పినట్లే రసజ్ఞ కూడా సూర్యునివైపు

చూస్తూ వుండిపోయింది.

"అమ్మా" వెనుకనుంచి మధురంగా విన్పించింది. ఆ పిలుపు చిరునవ్వుతో పలుకరిస్తున్నట్లుగా గుమ్మం దగ్గర నిలబడింది ఉజ్వల.

రాత్రంతా తాను ఏం ఆలోచిస్తూ గడిపింది?

ఈ పిల్ల భవిష్యత్తు గురించా?

వో చీకటి రాత్రి తనను కబళించేసి చల్లగా, కొండచిలువలా ఏమీ ఎరుగనట్లు జారుకున్న ప్రభు గురించా? రెండేళ్ళ కాపురం... రెండు యుగాల అనుభవం గూర్చి ఆలోచిస్తూ వుండిపోయిందా? అసలు అది కాపురమేనా? నరకమా?...

శ్రీనివాసనగర్‌లో ఉజ్వలకు మంచి సంబంధం వుందని చెప్పారు... ఆ అబ్బాయి ఎటువంటి వాడోనని ఆలోచిస్తూ వుండిపోయిందా?

35 ఏళ్లు మీద పడుతున్నా తనవైపు ఇంకా ఆశగా, ఆబగా చూసే మగాళ్ళ గురించా?

అవును... ఏ విషయం గూర్చి ఆలోచించింది తను... రాత్రంతా తను అన్ని విషయాలగూర్చి ఆలోచిస్తూ వుండిపోయిందా... అసలు ఏం విషయం ఆలోచించలేదా ... ఏమో!

"ఏమిటమ్మా! ఉదయాన్నే పరధ్యానంలో పడ్డావ్" తల్లి భుజం పట్టుకుని మెల్లగా కుదిపింది ఉజ్వల.

"ఎర్రగులాబిలాంటి ఈ అమ్మాయికి మంచి మొగుడు ఎక్కడ దొరుకుతాడానని ఆలోచిస్తున్నానే" అంది రసజ్ఞ నవ్వుని మొహానికి పులుముకుంటూ.

"ఈరోజు స్కూలుకు డుమ్మా కొట్టా అనుకుంటున్నావా? ఈ రోజు మీ స్కూలుకు మంత్రిగారు వస్తున్నారని చెప్పావుగా?"

"స్కూలుకు వెళ్ళడంలేదు. పక్కింటి పరిమళా టీచరుతో లీవ్ లెటర్ పంపిస్తాను... శ్రీనివాస్‌నగర్ వెళ్ళాల్సిన పనివుంది" అంది రసజ్ఞ.

"నువ్వు ఉత్త 'మూడీ'వి మమ్మీ! ఏ క్షణంలో ఏం పని చేస్తావో ఎవ్వరికీ అర్థంకాదు"

కూతురు మాటలకు నవ్వుకుంది రసజ్ఞ.

"ఎక్కడికో బయటకు వెళ్ళాలనుకుంటున్నావ్. కాస్త మంచిచీర కట్టుకో అమ్మా! ఎప్పుడు నేతచీరలే కట్టుకుంటావ్. నువ్వు చక్కగా ముస్తాబయ్యావంటే మా అక్కయ్య చెల్లెలువో అనుకుంటారు'?

"నీకు మంచి భర్త దొరకాలని నేను వెటాడుతుంటే నన్ను అందంగా ముస్తాబు అవ్వమంటున్నావ్! పొరబాటున నీ మెడలో బదులు పెళ్ళికొడుకు నా మెడలో తాళిబొట్టు కట్టేస్తాడేమోనే!"

"నో ప్రాబ్లమ్ మమ్మీ! అంతా మనమంచికే. నాన్న ఎప్పుడో నాకు ఊహ తెలియనప్పుడే చనిపోయాడని చెప్పావ్. నువ్వు మళ్ళీ చేసుకుంటే తప్పేముంది. అసలు ఎప్పుడో పెళ్ళి చేసుకోవాల్సింది. చాలా ఆలస్యం చేసావ్!" అంది ఉజ్వల.

"పిచ్చివాగుడు కట్టిపెట్టి వెళ్ళి మొహం కడుక్కో! కాఫీ కలుపుకువస్తాను" అనేసి లోపలికి వెళ్ళింది రసజ్ఞ.

ఇంటి పనంతా ముగించుకుని బయటపడేసరికి పదిగంటలయ్యింది. బస్‌స్టాప్ దగ్గరకెళ్ళి నిలబడింది రసజ్ఞ.

రోడ్డుమీద వచ్చేపోయే కార్లు, లారీలు, రిక్షాలు, సైకిళ్ళు, జనం కేకలు, నవ్వులు అంతా సందడిగా వుంది.

ఇంట్లో నిశ్శబ్దానికి, బయట సందడికి ఎంత తేడా వుందో గమనించిందామె. మనుష్యుల మధ్య వున్నప్పుడు వుండే ప్రశాంతత ఇంట్లో ఒంటరిగా వున్నప్పుడు వుండదామెకు. రాత్రిళ్లు మాత్రం ఆమెకు నరకమే.

తొమ్మిదవ నెంబర్ బస్సు వచ్చింది.

'లక్కీ నెంబర్' అనుకుంది రసజ్ఞ మనస్సులో.

బస్సు నిండా జనం.

కండక్టర్‌కు నిండా పాతికేళ్లు కూడా లేవు. అభిమన్యుడిలా జనం మధ్యనుండి /దూచ్చుకుపోతూ టిక్కెట్లు ఇస్తున్నాడు.

అతన్ని చూడగానే రసజ్ఞకు ప్రభు గుర్తుకువచ్చాడు.

పదహారేళ్ళ క్రితం తననూ రెండేళ్ళ ఉజ్వలను నక్షత్రాలు ఆకాశంలో నిస్సహాయంగా చూసేవేళ వదిలేసి వెళ్ళిపోయాడు.

ప్రభుని ఎలా నమ్మింది తను?

హిరోషిమాలో ఘోరం జరుగుతుందని ఐన్‌స్టీన్ కలగన్నాడా? నిప్పును కనుగొన్న ప్రొమిథీయస్ ఆ నిప్పుతోనే కట్నం తేలేదని అన్నెంపున్నెం ఎరుగని ఆడపిల్లలను కాల్చివేస్తారని అనుకున్నాడా?

గొర్రె కసాయివాడిని నమ్మినట్లు నమ్మింది. తనకు కడుపునిండా పచ్చిక మేపితే ఎంత మంచి వాడు నా యజమాని అనుకుందట! తనను శుభ్రంగా స్నానం చేయిస్తుంటే గర్వపడిందట. బొట్టు పెడుతుంటే తనను ఎంతగా గౌరవిస్తున్నాడని పొంగిపోయిందట ఆ పిచ్చి గొర్రెపిల్ల. ఆ తరువాత కత్తితో తన మెడ కత్తిరిస్తాడని ఆ గొర్రెకేం తెలుసు?

"రసజ్ఞా! ఈ బిచ్చగాడికి ప్రేమభిక్ష పెట్టావ్. మనకు ప్రతి రాత్రి వసంతరాత్రే. ఈ ప్రేమ సామ్రాజ్యానికి మనమిద్దరమే వారసులం" అనేవాడు ప్రభు.



## దేశభక్తులు

దేశానికి చేసిన సేవలకు గానూ ప్రముఖులకు భారతరత్న, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ బిరుదులను ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రదానం చేస్తుంది. 1954లో ప్రారంభమైన ఈ అవార్డులు ఇప్పటిదాకా 1994 మందికి లభించాయి. భారతరత్న బిరుదను 21 మందికి, పద్మవిభూషణ్ 117 మంది అందుకొంటే 632 మంది పద్మభూషణ్‌నూ, 1224మంది పద్మశ్రీలను పొందారు! అయితే ఈ బిరుదుల్ని కొన్నాళ్ళు జనతా ప్రభుత్వం రద్దు చేయటం జరిగింది.

—జూపిటర్

బ్రౌన్‌షుగర్‌కి అలవాటు పడినట్లుగా అతను పక్కన లేనిదే తనకు ఏం తోచేది కాదు. తన ఆలోచనలన్నీ అతని చుట్టూ పరిభ్రమించేవే!

అప్పుడు తన అందం అతనికి నిద్రపట్టనిచ్చేది కాదు.

ఇప్పుడు తనకు నిద్రపట్టడం లేదు రాత్రుళ్లు. అతను గుర్తుకువస్తే చాలు. మనస్సునిండా అసహ్యం పేరుకుపోయి అగ్నిగుండంలా తయారవుతుంది మనస్సు.

"మీ స్టేజి వచ్చేసిందండీ!" రసజ్ఞ దగ్గరకొచ్చి చెప్పాడు కండక్టర్.

కంగారుగా బస్సు దిగింది రసజ్ఞ.

దగ్గర్లో పెద్దగా ఇళ్లులేవు. శ్రీనివాసనగర్ గూర్చి రోడ్డుప్రక్కన వున్న షాపులవాళ్ళని అడిగింది. రెండు కిలోమీటర్లు ముందుకు నడిచి వెళ్తే వస్తుందని చెప్పారు. ఆ కాలనీకి వెళ్లే బస్సులు వున్నాయటగాని అవి ఏ గంటకో రెండుగంటలకో ఓ బస్సు వస్తుందట.

మెల్లగా నడిచివెళ్ళడమే మంచిదనుకుందామె.

అప్పటివరకూ అన్పించలేదుగానీ కుర్రవాడిని చూడడానికి తనొక్కతే బయల్దేరకుండా వుండాల్సింది. తోడుగా తనతోపాటే పనిచేసే టీచర్లనెవరినైనా వెంటబెట్టుకువస్తే బాగుండుననుకుంది.

గాయత్రీదేవి పేరున్న అడ్వకేట్. సోషల్ వర్కర్. మంచి సంస్కారం వున్న స్త్రీ. స్కూల్లో స్పోర్ట్స్ డే ఫంక్షన్ జరిగినప్పుడు బహుమతి ప్రదానం చేయడానికి గాయత్రీదేవి వచ్చింది. అప్పుడే ఆమెలో రసజ్ఞకు పరిచయం ఏర్పడింది. ఆమెకు పెళ్ళీడువచ్చిన కొడుకు వున్నాడని, కట్నకానుకలు ఆశించదని స్కూల్లో ఎవరో చెప్పడంతో ఆమెను కలవాలని బయలుదేరింది రసజ్ఞ.

పట్టణానికి కొంచెం దూరంగా వుందేగాని శ్రీనివాస్‌నగర్ పెద్ద కాలనీయే. ఎక్కడ చూసినా అందంగా కట్టబడిన ఇళ్లే కనిపించాయి.

ఈ మధ్యకాలంలో కాలనీ ఏర్పడింది. అందుకే గతుకుల రోడ్లుగానీ, మురికికాలువలుగానీ ఆమెకు కన్పించలేదు.

రోడ్లమీద జనసంచారం లేదు. ఎక్కడో క్రికెట్ మ్యాచ్ జరుగుతున్నట్లుంది. టీవీలో ప్రత్యక్ష ప్రసారం జరుగుతుండడంతో అందరూ ఇళ్ళల్లోనే వుండిపోయారు. ఇళ్ళలోనుండి పెద్దగా అరుపులు వినిపిస్తున్నాయి. క్రికెట్ ఆటలోపడి పిల్లలు పెద్దగా అరుస్తుంటే ఇంట్లో పెద్దవాళ్లు కేకలు వేస్తున్నారు.

కాగితంమీద రాసుకున్న అడ్రెస్‌ను ఇంట్లోకూర్చుని క్రికెట్ ఆటలో మానసికంగా మునిగిపోయిన వాళ్ళను బయటకు పిలచి చూపించింది.

విసుక్కోకుండానే ఆ ఇల్లు ఎక్కడ వుందో గుర్తులు చెప్పారు.

ఆ కాలనీలో గాయత్రీదేవికి మంచి పేరు వున్నట్లు వాళ్ల మాటలబట్టే తెలుసుకుంది రసజ్ఞ.

ఆకుపచ్చ రంగు డాబా ఇంటిముందు నిలబడింది. ఇంటి తలుపులు వేసి వున్నాయి. కిటికీ నుండి టీవీ క్రికెట్ హోరు పెద్దగా విన్పిస్తోంది. ఇంటి ముందు రెండు నిముషాలు తటపటాయిస్తూ నిలబడింది.

గాయత్రీదేవికి తను వచ్చిన పని చెప్పగ లుగుందా?

ఆమె ఒప్పుకుంటుందా?

అబ్బాయి ఎలా వుంటాడో?

కాలింగ్‌బెల్ నొక్కి కిందచూపులు చూస్తూ నిలబడింది రసజ్ఞ. పాతికేళ్ళ కుర్రాడు విసుగ్గా తలుపు తెరచి ఏమిటన్న ట్లు రసజ్ఞవైపు చూసాడు. తలుపు పూర్తిగా తెరిచి ఆమెను లోపలకు రమ్మన్నమనే ప్రయత్నం చేయలేదతను.

ఒక్క క్షణం ఆమెతో మాట్లాడి మళ్లీ తలుపు వేసుకొనే ప్రయత్నంలో ఉన్నాడత ను.

''గాయత్రీదేవిగారు వున్నారా?''

''అమ్మ ఇంట్లోలేదు''అనేసి తలుపు వేసుకున్నాడు.

ఇతనేనన్నమాట గాయత్రీదేవి కొడుకు. కుర్రాడు అందంగానే వున్నాడుగాని ఎందు కో ఉజ్వలకి నప్పడు అనుకుంది ఆమె మనసులో.

మళ్ళీ కాలింగ్ బెల్ నొక్కింది.

రెండునిముషాలు గడిచాక తలుపు తీసా డు తను.

''గాయత్రీదేవిగారిని కలవాలి. ఎప్పుడు తిరిగి ఇంటికి వస్తారు?'' మంద్రస్థాయిలో అడిగింది రసజ్ఞ.


''మీరు అసలు వచ్చిన పని చెప్పండి. ఫోన్ చేసుకోవాలనుకుంటున్నారా? సారీ ఫోన్ అవుట్‌ఆఫ్ ఆర్డర్''

''ఫోను కోసం కాదు బాబూ?''

''నాకు తెలుసండీ. మమ్మీకోసం వచ్చే వాళ్ళంతా ఏదో బాగా పరిచయం వున్నవాళ్ళ లాగా మాట్లాడతారు. ఏహొక అవసరం వుండి వస్తారు. చీటికీ మాటికీ మమ్మల్ని విసిగిస్తూ ఉంటారు. మీకు ఫోన్ కాకపోతే మమ్మీ కారు కావాలి అంతేనా! కారు చెడిపోయిందండి'' చాలా స్పీడ్‌గా మాట్లాడే స్తున్నాడతను.

ఆ యువకుడివైపు తేరిపార చూసింది.

ఎక్కువగా గాయత్రీదేవి పోలికలే. అం



దుకనే అంత అందంగా వున్నాడు. ఇతని గొంతు ఎక్కడో విన్నట్లుందే!

బాగా పరిచయం వున్నవారి గొంతులా వుంది. ఎవరిది?

గుర్తుకు రాలేదు ఆమెకు.

"వచ్చిన పనేమిటో చెప్పండి. టీవీలో క్రికెట్ మ్యాచ్ చూడాలి" అతను తలుపు దగ్గరే నిలబడే మాట్లాడుతున్నాడు.

"మీ అమ్మగారితో ముఖ్యమైన విషయం మాట్లాడాలని వచ్చాము"?

"డబ్బులు కోసమా? దారినపోయే దానయ్యలందరికీ మా అమ్మ దానకర్ణుడి తల్లిలా దానం చేస్తూవుంటుంది" మొహం చిట్లించుకుంటూ అన్నాడతను.

అతని మాటలు, ప్రవర్తన నచ్చలేదు రసజ్ఞకు. సభ్యత, సంస్కారం కొరవడినట్లని పించింది...

అతను విసురుగా తల ఎగరేయడం చూస్తుంటే ప్రభు గుర్తుకు వచ్చాడామెకు.

"చిన్నకాగితం మీద నా పేరు, అడ్రెస్ రాసి ఇచ్చి వెడతాను బాబూ! మీ అమ్మగారు రాగానే నేను వచ్చానని చెప్పు అంతే... నువ్వు డబ్బేమీ ఇవ్వనక్కర్లేదు. మీ అమ్మగారితో నాకేం పనేం లేదు... మర్యాదపూర్వకంగా కలవాలని వచ్చానంతే. ఒక్క గ్లాసు మంచినీళ్లు ఇచ్చావంటే చాలు. అడ్రెస్ ఇచ్చి వెళ్ళిపోతాను" అంది రసజ్ఞ.

అతను ఆమె మాటలకు సిగ్గుపడిన లక్షణాలు కన్పించలేదు. తప్పనిసరైనట్లు ఆమెను లోపలికి రమ్మని పిలిచాడు.

డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని వ్యానిటీబ్యాగ్‌లోంచి చిన్న కాగితంతీసి తన అడ్రెస్ రాసి ఇచ్చింది. రసజ్ఞ

"కరెంటు ఇప్పుడే వచ్చింది. ఐస్‌వాటర్ లేదు. చుట్టుపక్కలవాళ్లు ఐస్‌వాటర్‌కోసం మా ఇంటిమీద పడి చస్తారు" అంటూ గ్లాసుతో మంచినీళ్లు తెచ్చి ఇచ్చాడతను.

నమ్రతగా, సౌమ్యంగా మాట్లాడే గాయత్రీదేవికి, ఆమె కొడుక్కి చాలా తేడా వుందనుకుంది.

అడ్రెస్ కాగితం ఇచ్చి లేచి వెళ్ళబోయింది రసజ్ఞ.

టేబుల్ మీద వున్న ఫొటో మీద ఆమె దృష్టి పడింది.

గాయత్రీదేవి పక్కనమున్నదెవరు? ఉలిక్కిపడింది వో క్షణం... ప్రభు కదూ!

దగ్గరకెళ్ళి ఫొటో చేతిలోకి తీసుకుని చూసింది.

"ఏమిటి పరీక్షగా చూస్తున్నారు. మా ఫాదర్, మదర్... నేను గర్భంలో వున్నప్పుడే మా నాన్నగారు చనిపోయారట" అన్నాడతను.

"మీ నాన్నగారి పేరు తారకప్రభు కదూ" తడబడే గొంతుతో అంది రసజ్ఞ.

అవునన్నట్లు తలూపాడు అతను.

"మీ నాన్నగారు చనిపోయారని చెప్పిందా మీ అమ్మ"

మళ్ళీ తలూపాడు అతను.

గేటు దగ్గరకొచ్చింది రసజ్ఞ.

"బాబూ మీ అమ్మ దానకర్ణుడి తల్లిలా దానం చేస్తుందని చెప్పావుకదూ. వాకంటే ముందే మీ అమ్మ తను నమ్మినవాడికి సర్వస్వం దానం చేసింది. ఆమె మరో కుంతి. పెళ్ళికాకముందే కొడుకును కంది.

నువ్వు కర్ణుడివేగాని దానకర్ణుడివి మాత్రం కాదు'' అనేసి విసవిసా నడుస్తూవెళ్ళిపోయింది రసజ్ఞ.

ఆమె మాటలు అతనికి అర్థంకాలేదు. పిచ్చిదేమో అనుకున్నాడు మనస్సులో.

సిటీ బస్సు ఎక్కి కూర్చుంది రసజ్ఞ.

బస్సులో పెద్దగా జనంలేరు.

కండక్టర్ కుర్రాడుకాదు. మందకొడిగా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

ఆలోచనలు ఆమెను ముట్టడిచేసాయి.

ఉజ్వలకి తను చెప్పినట్లు గాయత్రీదేవి కొడుక్కి తండ్రి చనిపోయాడని చెప్పిందే. అమాయకంగా మనస్సును అర్పించిన ఆడపిల్లను మోసం చేసినవాడు చనిపోయినవాడి కింద లెక్కే. వాడు బ్రతికున్న శవం... స్కూలు పిల్లలను బొంబాయికి ఎక్స్‌కర్షన్‌కు తీసుకువెళ్తే ప్లానిటోరియం దగ్గర కన్పించాడు ప్రభు...

తుమ్మమొద్దులాంటి భార్య, నలుగురు పిల్లలతో కారు ఎక్కే ప్రయత్నంలో వున్నాడు.

తనని చూసి పలకరించే ప్రయత్నంచేసాడు కానీ తానే పట్టించుకోకుండా ప్లానిటోరియం లోపలికి స్కూలుపిల్లలతో వెళ్లిపోయింది.

బస్సులో ఖాళీవున్న రసజ్ఞను తాకుతూనిలబడ్డాడు ఒకాయన.

చిరాకుగా అతనివైపు చూసింది.

కంగారుగా ముందుకు జరిగాడు అతను.

అతన్ని చూడగానే ఉదయాన్నే లైటు వేయగానే జరజరా పక్కకు తప్పుకుపోతున్న బొద్దింక గుర్తుకు వచ్చింది.

* * *

''ఏంమ్మా! వెళ్ళిన పని అయ్యిందా?'' రసజ్ఞ ఇంటికి రాగానే ఉజ్వల అడిగింది.

''నీకు మొగుడిని చూడాలని వెళ్తే నీ అన్నయ్య కనిపించాడు'' అంది రసజ్ఞ.

''అన్నయ్య ఎవరమ్మా'' తల్లిమాటలు అర్థం కాలేదు ఉజ్వలకు.

''నీకో పెద్దమ్మా, అన్నయ్య వున్నట్లు ఈరోజే తెలిసిందే నాకు'' అంది రసజ్ఞ.

తల్లి మాటలు పెద్దగా సీరియస్‌గా తీసుకోలేదు ఉజ్వల.

''కులాలేమిటి? మతాలేమిటి? అందరూ మనకు చుట్టాలే! అందరం ఆదిమ మానవుల సంతతికి చెందినవాళ్లమే. అందరూ బంధువులే'' అని తల్లి ఎప్పుడూ అంటూనే ఉంటుంది. అదే ఉద్దేశంతో మాట్లాడి ఉంటుందిలే అనుకుంది.

రాత్రిపూట వంట చేయడానికి వంటింట్లోకి వెళ్ళి లైటు వేసింది రసజ్ఞ.

... ఎక్కడ చూసినా బొద్దింకలు. అన్నిటికీ ప్రభు పోలికలే. బొద్దింకలు ఆదరాబాదరా పరుగెత్తుతున్నాయి రసజ్ఞను చూసి.